క్లుప్తంగా

వైరా తహసీల్దార్‌గా జగదీశ్వర ప్రసాద్


జగదీశ్వర ప్రసాద్

వైరా: వైరా నూతన తహసీల్దార్‌గా వి.జగదీశ్వర ప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న నారపోగు అరుణ కలెక్టరేట్‌లో సూపరెండెంట్‌గా బదిలీ కావడంతో ఆమె స్థానంలో ఖమ్మం ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓగా విధులు నిర్వహిస్తున్న జగదీశ్వర ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు.

తహసీల్దార్‌కు వినతి

ముదిగొండ: తాము సాగు చేసుకుంటున్న భూమిలో కొందరు అక్రమంగా చేయించుకున్న పాస్ పుస్తకాలను రద్దు చేయాలని ముదిగొండ గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ శిరీషకు వినతిపత్రం అందించారు. ముదిగొండ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 236లోని 25.12 ఎకరాల భూమిని కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్నామన్నారు. ఆ ప్రభుత్వ భూమిని కొందరు పట్టాలు చేయించి తమదే అంటున్నారని తెలిపారు. అట్టి భూమిని స్వాధీనం చేసుకొని నిరుపేదలైన ఎస్సీలకు అందించాలని గ్రామస్తులు కోరగా.. తహసీల్దార్ పరిశీలిస్తామని తెలిపారు.

కౌలు రైతులను ఆదుకోవాలి

వేంసూరు: కౌలు రైతులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులతో పాటు పంట రుణాలు అందించి ఆదుకోవాలని కిసాన్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రావుల పుల్లారావు అన్నారు. సోమవారం వేంసూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కౌలు రైతులకు పంటల సాగు బ్యాంక్ రుణాలు మంజురు చేయడంతో పాటు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన పంట నగదును వారి ఖాతాల్లో జమచేయాలన్నారు. కార్యక్రమంలో పెద్దగౌడ శ్రీనివాసరావు, పొట్లపల్లి భాను ప్రకాష్, దొడ్డ రామారావు, కొండల్ పెరుమళ్ల, కందిమళ్ల చెన్నారావు పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ నాయకుడు మృతి

కొణిజర్ల: మండలంలోని రామనర్సయ్యనగర్‌కు చెందిన సీనియర్ సీపీఐ నాయకుడు తమ్మనబోయిన వెంకయ్య సోమవారం మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని మాజీ జెడ్పీటీసీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, పాడిరైతుల సంఘం రాష్ట్ర నాయకుడు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు సందర్శించి నివాళులు అర్పించారు. సీపీఐ నాయకులు కంపసాటి వెంకన్న, ఆంగోత్ మంగీలాల్,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదం.. కేసు నమోదు

ఏన్కూరు: తండ్రి కూతురికి జరిగిన భూ వివాదంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చింతల జయరాజుకు నిర్మల, రమాదేవి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారికి వివాహం చేశాడు. పెద్దకుమార్తె, అల్లుడిని ఇల్లరికం తెచ్చుకున్నాడు. తనకు ఉన్న భూమిలో ఇద్దరికి సమాన వాటాలు పంచుతున్నానని నిర్మలతో తెలుపడంతో.. ఆమె దానికి అంగీకరించలేదు. ఈ క్రమంలో వారి ఇద్దరిమధ్య జరిగిన వాగ్వాదంలో పెద్ద కుమార్తెను కొట్టాడు. దీంతో ఆమె స్థానిక పోలీస్‌స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు ఎస్సై రవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడాలి

బోనకల్: దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొలడుగు బాస్కర్ అన్నారు. మండలంలోని జానికీపురం గ్రామంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నిర్మాణం అనే అంశంపై మాట్లాడారు. కమ్యూనిస్టులు ప్రజాసేవకులుగా ఉంటారని దోపిడీని అరికట్టేందుకు పోరాటం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు, చింతలచెర్వు కోటేశ్వరరావు, జొన్నలగడ్డ సునీత, పున్నమ్మ, గుగులోతు పంతు, కిలారు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లస్థలాలు అందించాలి

పెనుబల్లి : ప్రతి పేదవాడికి ఇళ్ల స్థలాలు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యురాలు మాచర్ల భారతి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జూలై మొదటి వారం నుంచి ప్రారంభమయ్యే రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయడానికి కార్యకర్తలు కార్యాచరణ ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు విఠల్‌రావు, తిరుపతిరావు, సత్యం, నరసింహారావు, బాబు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి దారేది..


ముదిగొండ సమీపంలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయం గుట్ట

దేవాలయ భూములు ఆక్రమం
- దేవుడి గుట్టను సైతం వదలని అక్రమార్కులు
- ఆస్తులు కాపాడాలని భక్తుల మొర
- పట్టించుకోని అధికారులు, పాలకులు

ముదిగొండ: కాకతీయుల కాలం నాటి శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం ముదిగొండ సమీపంలో వందల సంవత్సరాల నుంచి విరజిల్లుతోంది. స్వయంభుగా వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి గుట్టకు వెళ్లే దారిపై అక్రమార్కుల కన్ను పడింది.

పత్రాలు సృష్టించి.. మట్టి తరలింపు..

ముదిగొండకు చెందిన కొందరు ప్రబుద్ధులు పత్రాలు సృష్టించి ఆలయం చుట్టూ ఉన్న భూములు తమవేనని రెవెన్యూ శాఖ నుంచి తీసుకొచ్చిన పత్రాలను ఖమ్మం-కోదాడ నేషనల్ హైవే 365 రహదారి పనులు చేపడుతున్న పవర్‌మెక్ కంపెనీకి బేరం కుదుర్చుకున్నారు. ఆ భూములలో ఉండే మట్టి మాదేనని అమ్మజూపారు. ఆలయ ప్రాంగణం భూములు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లడంతో భారీ యంత్రాలతో టిప్పర్ల ద్వారా మట్టిని తరలించడంతో గుట్ట కుదించుకుపోతోంది.

పనులను అడ్డుకున్న గ్రామస్తులు..

ముదిగొండ, సువర్ణాపురం గ్రామాల ప్రజలు, భక్తులు గమనించి రోడ్డు పనులకు వాడుతున్న మట్టిని నిలిపివేయాలని అడ్డుకోవడంతో అసలు విషయం బయటపడింది. ఆలయ భూములను వారు ఆ భూములు మావేనని మా పేరుతో పట్టాలున్నాయని నకిలీ పత్రాలను చూపించి అధిక మొత్తంలో మట్టిని నేషనల్ హైవే వారికి విక్రయించారని భక్తులు ఆరోపించారు.

అక్రమార్కులపై దృష్టిసారించాలి..

ముదిగొండ సర్పంచ్ మందరపు లక్ష్మి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మంకెన దామోదర్, రెండు గ్రామాల ప్రజలు, భక్తులు కలిసి స్థానిక తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం ఇచ్చినా ఫలితం లేకపోయిందని వాపోయారు. ఇటీవలె జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు కూడా వినతిపత్రం అందజేసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఆలయం చుట్టూ గుట్ట ప్రదేశంలో రాళ్లతొలగించి, ఆక్రమించిన అక్రమార్కులపై దృష్టిసారించాలని, ఆలయ భూములు కాపాడాలని, అక్రమంగా మట్టిని తరలించకుండా చూడాలని భక్తులు, మండల ప్రజలు కోరుతున్నారు.


గుడి ప్రాంగణంలో ఆక్రమణకు గురైన స్థలం

ఆక్రమణకు గురైంది..



వందల సంవత్సరాలం నాటి దేవాలయ ప్రాంగణం ఆక్రమణకు గురైంది. దీనిని కాపాడే నాథుడే లేకపోయే సరికి దీప దూప నేవేద్యాలకు దూరం కానున్నది. కాలినడకన వెళ్లే వారికి నడిచే మార్గం లేకుండా చేస్తున్నారు. ఇది తెలిసి కూడా పురోహితులకు సంభందం లేకుండా చేస్తున్నారు. జిల్లా, మండల దూప దీప నేవేద్య సంభందీకులు పట్టించుకోవడం లేదు.

– రొంపిచర్ల యజ్ఞేష్, ఆలయ పూజారి, ముదిగొండ

అధికారులు స్పందించాలి..



మా ఊరి దేవుడు మా లక్ష్మీ నరసింహస్వామి, మమ్ములను, లోకాలను కాపాడే దేవుడు గుట్ట చుట్టూ దారి లేకుండా ఆక్రమించి మట్టిని తరలించుకుపోతే ఎవరు బాధ్యులు. ఏళ్లనాటి ఆలయం ఆక్రమణలకు గురైతే భక్తులకు, ప్రజలకు దారేది. ఎలాగైనా అధికారులు కలగజేసుకుని ఆలయ ఆస్తులను కాపాడాలి.

– కొమ్మూరి వెంకయ్య, ముదిగొండ


కలెక్టర్‌కు వినతి అందజేస్తున్న గ్రామస్తులు (ఫైల్)

అన్ని రంగాల్లో గ్రామాల అభివృద్ధి


గాంధీనగర్‌కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

చింతకాని: గ్రామాలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేలా రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ తెలిపారు. మండలంలోని గాంధీనగర్‌కాలనీ, బస్వాపురం గ్రామాల్లో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లకు సోమవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో గ్రామాల అభివృద్ధికి నేరుగా నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. తద్వారా అన్ని వసతులు సమకూరుతున్నాయని చెప్పారు. అనంతరం గాంధీనగర్‌కాలనీ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురి కుటుంబాలను కమల్‌రాజ్ పరామర్శించారు. ఈకార్యక్రమాల్లో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, సర్పంచ్‌లు కాలంగి లలిత, రాసాల సాంబలక్ష్మి, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెంట్యాల పుల్లయ్య, బొడ్డు వెంకట్రామయ్యతో పాటు గురిజాల హన్మంతరావు, మార్గం రమాదేవి, తునికిపాటి కళావతి, ఓర్సు వీరభద్రం, మార్గం కొరివీరమ్మ, మంకెన రమేష్, వంకాయలపాటి లచ్చయ్య, నూతలపాటి వెంకటేశ్వరరావు, చల్లా అచ్చయ్య, షేక్ సిలార్ సాహెబ్, చలమయ్య, ఏసుదాసు, ఖాసీం, ప్రకాష్ పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి


వైరా: మాట్లాడుతున్న ఏసీపీ రహమాన్


ఎర్రుపాలెం: ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

వైరా: యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని వైరా ఏసీపీ ఎంఏ రహమాన్ అన్నారు. సోమవారం వైరాలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు బానిసై చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నారు. తల్లి దండ్రులు, విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యార్థుల ప్రవర్తనల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వైరా సబ్ డివిజన్ పరిధిలో ఎవరైనా మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్నా, అమ్మకాలు సాగిస్తున్నా అటువంటి వారి వివరాలును వెంటనే పోలీసులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో వైరా సీఐ తాటిపాముల సురేష్, ఎస్సై మేడా ప్రసాద్, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఎక్సైజ్ శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: యువత సన్మార్గంలో పయనించాలని ఎస్సై ఎం.సురేష్ అన్నారు. మండలంలోని పోలీస్‌స్టేషన్ నుంచి రింగ్ సెంటర్ వరకు విద్యార్థులు, ప్రజాప్రతినిధులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్‌కు వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మొగిలి అప్పారావు, నాయకులు కొత్తపల్లి ప్రశాంత్, కత్తి రవి, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏన్కూరు: యువత మత్తుకు బానిసకావొద్దని ఎస్సై రవి అన్నారు. మండలంలోని స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి ప్రధాన సెంటర్ వరకు విద్యార్థులతో ర్యాలీగా వెళ్లి అక్కడ మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లాడ: మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై పి.సురేష్ అన్నారు. ఈ సందర్భంగా సోమవారం పోలీస్ శాఖా, బాలభారతి విద్యాలయం ఆధ్వర్యంలో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బాలభారతి విద్యా సంస్థల కరస్పాండెంట్ ప్రవీణ్, ఎస్సై జేవీఆర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలకు ట్యాబ్‌లు పంపిణీ


కల్లూరు: హెచ్‌ఎంలకు ట్యాబ్‌లు అందజేస్తున్న దృశ్యం

కల్లూరు: కల్లూరు మండలంలోని 48 ప్రాథమిక, 9 ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు కల్లూరు ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రమేష్ ఆధ్వర్యంలో ట్యాబులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ట్యాబుల ద్వారా ఉపాధ్యాయులు మధ్యాహ్నం భోజనం రిపోర్టులు, పిల్లల హాజరు, మన ఊరు – మన బడి నివేదికలు పంపవలసి ఉంటుంది. విద్యార్థులకు డిజిటల్ బోధన పాఠాలు కూడా చూపించాల్సి ఉంటుంది. ఈ ట్యాబుల గురించి రిసోర్స్ పర్సన్‌గా నారాయణపురం హెచ్‌ఎం వంగా రామారావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నున్నా కృష్ణయ్య, రాయల నాగేశ్వరరావు, సతీష్, బాలాజీ నాయక్, సిలివేరు కృష్ణారావు, నాగు, వీరన్న, శ్రీనివాసరావు, అప్పారావు, సీఆర్‌పీ రవీంద్ర, సీసీఓ షాబి తదితరులు పాల్గొన్నారు.

కొణిజర్ల: మండలంలోని 45 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రభుత్వం అందజేస్తున్న ట్యాబ్‌లను ఎంఈఓ శ్యాంసన్ కొణిజర్లలో అందజేశారు. ఈ ట్యాబ్‌లతో ఆన్‌లైన్ ప్రక్రియ సులభతరం అవుతుందన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు దామాల పుల్లయ్య, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

చింతకాని: మండల పరిషత్ కార్యాలయంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు ఎంఈఓ మోదుగు శ్యాంసన్ ట్యాబ్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పర్చగాని తిరుపతి కిషోర్, ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

కారేపల్లి: కారేపల్లి మైనార్టీ బాలికల గురుకుల విద్యాలయం, కళాశాలలో కెమిస్ట్రీ సబ్జెక్ట్ బోధించుటకు ఆశక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ ప్రిన్సిపాల్ ఎం.శైలజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ కెమిస్ట్రీ, బీఈడీ అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు అన్ని జిరాక్స్ సర్టిఫికెట్లతో కారేపల్లిలోని మైనార్టీ గురుకులంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గ్రామాల్లో ఎమ్మెల్యే సండ్ర పర్యటన

తల్లాడ: మండలంలోని మల్లవరం, మిట్టపల్లి గ్రామాల్లో సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పర్యటించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లోని మృతుల కుటుంబాలను పరామర్శించారు. మృతుల భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, ఎంపీపీ శ్రీనివాసరావు, కృష్ణమూర్తి, రాగమయి, సుధాకర్, రఘుపతిరెడ్డి, రామారావు, వీరమోహన్‌రెడ్డి, డి.వెంకటలాల్, రామలింగేశ్వరరావు, వెంకటి, వీరకృష్ణ, జీవీఆర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో గ్రంథాలయం ప్రారంభం

కొణిజర్ల: మండల కేంద్రం కొణిజర్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రంథాలయ భవనాన్ని ఎంఈఓ మోదుగు శ్యాంసన్ సోమవారం ప్రారంభించారు. ఈ గ్రంథాలయాన్ని పాఠశాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.


కొణిజర్ల ఉన్నత పాఠశాల గ్రంథాలయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

రూ.10 లక్షల ప్రమాద బీమా


అవగాహన కల్పిస్తున్న బాజీ బాబు

మధిర: తపాలా శాఖ ఆధ్వర్యంలో రూ.10 లక్షల ప్రమాద బీమా సౌకర్యంతో పాటు పలు సేవలు అందుబాటులో ఉన్నాయని మధిర సబ్ డివిజన్ పోస్టల్ ఇన్స్‌పెక్టర్ వి.బాజీబాబు తెలిపారు. సోమవారం మధిర మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్‌లో పోస్టాఫీస్ పథకాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. టాటా, బజాజ్ సంస్థల అనుసంధానంతో తపాలా శాఖ ఈ బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. టాటా సంస్థ ద్వారా రూ.399 బీమా సౌకర్యంతో పాటు, బజాజ్ సంస్థ ద్వారా రూ. 396, రూ.258 భీమా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ప్రమాద బీమా సౌకర్యాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ వరలక్ష్మి, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ శివరాజు శ్రీనివాసరావు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

గేటుకారేపల్లిలో దేవాదాయ భూముల సర్వే


దేవాదాయ భూములను సర్వే చేస్తున్న అధికారులు

కారేపల్లి: మండలంలోని గేటుకారేపల్లి, దుబ్బతండా గ్రామాల్లో ఉన్న దేవాదాయ ధర్మాదాయ భూముల సర్వే కార్యక్రమాన్ని కొత్తగూడెం డివిజన్ ఎండోమెంట్ పరిశీలకుడు పి.బెయిల్‌సింగ్ సోమవారం చేపట్టారు. ఈ రెండ్రుగ్రామాల్లో ఉన్న సుమారు 70 ఎకరాలను దేవాదాయ శాఖ సర్వేయర్ పసునూరి అనీల్ ఆధ్వర్యంలో కొలతలు వేసి, హద్దురాళ్లు పాతించారు. ఇదిలా ఉండగా.. ఇటీవల సోషల్‌మీడియాలో సర్వేను అడ్డుకోవాలని కౌలురైతులు చూస్తున్నరని హల్‌చల్ కావడంతో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ కార్యనిర్వాహణాధికారి వేణుగోపాలాచార్యులు, సిబ్బంది పర్సా సాయి, మూడ్ మోహన్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం


ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఎంఈఓ, తదితరులు

కారేపల్లి: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జిల్లాస్థాయిలో నిర్వహించిన టీఎల్ఎం(అభ్యసన బోధన సామాగ్రి) మేళాలో మండలంలోని పాటిమీదిగుంపు ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు సరిత బహుమతి అందుకుంది. ఈ సందర్భంగా ఆమెను సోమవారం సన్మానించారు. ఎంఈఓ జయరాజు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు బి.మంగ్యానాయక్, అజ్మీరా వీరూనాయక్, కేశవరావు, గుత్తా శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, సీతారాములు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

ఎర్రుపాలెం: మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం బనిగండ్లపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి వీరబాబు ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరికైనా అకస్మాత్తుగా గుండెపోటు వస్తే వారిని సత్వరమే సీపీఆర్‌ను కొనసాగించినట్లయితే వారి ప్రాణాలను కాపాడవచ్చు అన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ కృష్ణశ్రీ, సదాశివరావు, సూపర్‌వైజర్ వెంకటేశ్వరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమణ, సరిత, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

టీకాలతో మూగజీవాలకు రక్షణ


జీవాలకు టీకాలు వేస్తున్న వైద్యాధికారి అన్వేష్

బోనకల్: టీకాలతో మూగజీవాలకు రక్షణ కలుగుతుందని పశువైద్యాధికారి వై.అన్వేష్ తెలిపారు. మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో మూగజీవాలకు సోమవారం వ్యాధినిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వానాకాలంలో సీజనల్ వ్యాధులు, నివారణా చర్యల్లో భాగంగా టీకాలు వేస్తున్నామన్నారు. అదే విధంగా రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులు డీడీలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మర్రి తిరుపతిరావు, వైద్య సిబ్బంది నాగేంద్రకుమార్, శ్రీకాంత్, గోపాలమిత్రలు నాగేశ్వరావు, అశోక్, కృష్ణవేణి, త్రివేని తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం


ప్రజలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సంభాని


కల్లూరురూరల్: హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా సోమవారం మండలంలోని చెన్నూరు గ్రామంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ డిక్లరేషన్‌ను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం రాబోతుందన్నారు. 9ఏళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రజలకు చేసిందేమి లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్‌కుమార్, మండల అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, పీసీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డి, మోహన్‌రావు, వెంకటేశ్వరావు, జనార్దన్, శ్రీనివాసరెడ్డి, శేషిరెడ్డి, జాని, రావూరి వెంకటేశ్వరరావు, నలజాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


లీకేజీలతో.. నీరు కలుషితం



రామకృష్ణాపురం వద్ద నిలిచిన నీరు

కల్లూరు రూరల్: కల్లూరు సమీపంలోని రామకృష్ణాపురం ప్రధాన రహదారి పక్కన పైపులైన్ లీకేజీలతో భగీరథ నీరు కలుషితమవుతున్నది. నీరు సరఫరా చేసే పైపులు పగలడంతో నీరు వృథాగాపోవడంతో ఇక్కడ పెద్ద చెరువును తలపిస్తుంది. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు చూస్తున్నారు. ఈ మడుగులు కుక్కలు, పశువులకు ఆవాసాలుగా మారాయి. పలు గ్రామాల్లోని ప్రజలకు సరిగా నీరు సరఫరా కాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా ఆర్డీఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చాంబర్‌లో కూడా లీకేజీ కారణంగా నీరు కలుషితమవుతుంది. ఈ విషయమై మిషన్ భగీరథ ఏఈ రాజేష్‌ను వివరణ కోరగా.. రామకృష్ణాపురం వద్ద పైపులైన్ లీకేజీ విషయం తమ దృష్టికి వచ్చిందని వెంటనే మరమ్మతులు చేపడతామన్నారు. ఆర్డీఓ కార్యాలయం వద్ద గ్యాస్‌కట్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


వైరా: తహసీల్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న విశ్రాంత ఉద్యోగులు


మధిర: తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగులు


పెనుబల్లి: తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

వైరా/మధిర/సత్తుపల్లిటౌన్/ఎర్రుపాలెం/ఏన్కూరు/కల్లూరురూరల్/పెనుబల్లి: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సత్తుపల్లి, మధిర, వైరా, ఎరుపాలెం, ఏన్కూరు, కల్లూరు, పెనుబల్లి మండలాల్లో సోమవారం విశ్రాంత ఉద్యోగులు తహసీల్ ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పారుపల్లి వెంకటేశ్వరరావు, చిన్నంశెట్టి మల్లయ్య, ఆ సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు వనమారెడ్డి చెంచిరెడ్డి, మండల కమిటీ అధ్యక్షుడు శీలం పత్రాపరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాఘవరపు కోటేశ్వరరావు, ఆ సంఘం అధ్యక్షులు నర్సయ్య, కె.మునేశ్వరరావు లు మాట్లాడారు. కనీస పింఛన్ రూ 30 వేలకు పెంచాలని, పెడింగ్‌లో ఉన్న డీఏలు, హెల్త్‌కార్డులు, పీఆర్సీ, ఐఆర్ విడుదల, ఆదాయపన్ను మినహాయింపు, ప్రతి నెల 1న పెన్షన్ విడుతల తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. లేని ఝెడల దశల వారీగా ఉద్యమాలు చేపడతామన్నారు. ఈ మేరకు సత్తుపల్లిలో స్థానిక జవహర్‌నగర్‌లోని సంఘ కార్యాలయం నుంచి తహసీల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్ఐ జానిమియాకు వినతిపత్రాన్ని అందించారు. వైరా, మధిర, ఎర్రుపాలెం, కల్లూరు, పెనుబల్లి తహసీల్దార్లు జగదీశ్వర ప్రసాద్, కృష్ణ, డి.తిరుమలాచారి, బాబ్జి ప్రసాద్, రమాదేవిలకు వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమాలల్లో కాలం వీరభద్రం, మాధవరపు నాగేశ్వరరావు, అబ్రహం, విజయలక్ష్మి, అరుణ, పద్మావతి, కేశవరెడ్డి, బద్రుద్దీన్, అద్దంకి వెంకటరత్నం, జ్యోతి, నిర్మల, ప్రభుదాసు, కృష్ణయ్య, వెంకటాచార్యులు, బాబు, కృష్ణమూర్తి, ప్రకాశరావు, జమలాపురపు గోపాలకిషన్‌రావు, దేవరకొండ హనుమంతరావు, విష్ణుమూర్తి, విజయలక్ష్మి, వెంకట్రామిరెడ్డి, మిర్యాల నాగేశ్వరరావు, ఎస్.సరోజని, కంచర్ల వెంకటనర్సయ్య, జూపూడి లక్ష్మణరావు, కొల్లు గోపాలరావు, పైడిపల్లి సత్యనారాయణ, టీవీ కృష్ణయ్య సూరి, పైడిపల్లి శరత్‌బాబు, చల్లా కృష్ణారావు, నడిపల్లి పెంటయ్య, నాయకులు శ్రీనివాసరెడ్డి, సూర్యం, నరసింహారావు, రాంబాబు, ఉపేందర్ రావు, నాగేశ్వరరావు, తోట రామచంద్రయ్య, భూక్యా చందులాల్, యస్ శివలీల, సీహెచ్ వెంకటనర్సమ్మ, వేల్పుల కృష్ణయ్య, ఫ్రాన్సిస్, ఉమామహేశ్వరరావు, కోటయ్య, యేసన్న, నాగరాజు, జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.